క్లుప్తంగా

నూతన బోరు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 35వవార్డు బండగుంత వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మంచి నీటి బోరును ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ సోమవారం ప్రారంభించారు. గతంలో లక్ష్మీనగర్‌వాసులు గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి తాగునీటి ఇబ్బందిపై విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి కొత్తగా బోరును వేయించారు. వాటిని ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతా మారుతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ



ముస్లింలకు తోఫా అందిస్తున్న ఎంపీ

రామగిరి: ముస్లింలకు పవిత్రమాసం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పేరూరు, గంగంపల్లి, మాదాపురం గ్రామాల్లోని మసీదులల్లో ఎంపీ రంజాన్ తోఫా అందించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, మండల కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రహిమాన్, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కురుబ ముత్యాలప్ప, సర్పంచ్ రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

రుణ పరిమితి పెంచాలి

కనగానపల్లి: బ్యాంకుల ద్వారా ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకొనే రైతులకు రుణ పరిమితిని ఎకరాకు రూ.50 వేలకు పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు రైతాంగ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఖరీఫ్‌లో తీసుకునే పంట రుణాల రెన్యూవల్ వడ్డీ కట్టించుకొని చేయాలన్నారు. ఉపాధి పనుల్లో ప్రతి కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. రైతు సంఘం నాయకులు గోవిందు, రవి, ముత్యాలు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

ముదిగుబ్బ: ముదిగుబ్బ వ్యవసాయ సహకార సంఘంలో క్రాప్‌లోన్ తీసుకొన్న రైతు సోమల సూర్యనారాయణ ఇటీవల దొరిగిల్లు రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం సహకార సంఘం చైర్మన్ బయపరెడ్డి, సీఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతు భార్య భాగ్యలక్ష్మిదేవి, కుమారుడు నరేష్‌కు రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం



గ్రామీణులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: గ్రామీణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్ జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోదుగులకుంటలో సోమవారం ఆమె 104 సిబ్బందితో కలసి పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి, వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు.

బీజేపీని సాగనంపుదాం

ఎన్పీకుంట: ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ప్రచారభేరి గోడపత్రికలు విడుదల చేశారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి కదిరప్ప, సహాయకార్యదర్శి రాజేష్, నాయకులు రమణ, గంగులప్ప తదితరులున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: విద్యార్థి దశ నుంచే ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని డీఎఫ్ఓ నాగరాజునాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జగరాజుపల్లి వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో అవగాహన కల్పించారు. వంట పూర్తి చేసిన వెంటనే సిలిండర్‌కు ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ తప్పనిసరిగా ఆఫ్ చేయాలన్నారు.

ధర్మవరంలో

ధర్మవరం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక అధికారి రాజు వివరించారు.

ప్రజలతో మమేకం.. సమస్యకు పరిష్కారం



జేకేపల్లిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

అమడగూరు: హలో అన్నా, హలో అక్కా అందరూ బాగున్నారా ఏదైనా సమస్య ఉందా, ఉంటే చెప్పండి పరిష్కరిస్తా అంటూ గ్రామస్తులను హుషారుగా పలకరించారు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి. సోమవారం జౌకలకొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండుటెండను సైతం లెక్క చేయకుండా అక్కడక్కడా మజ్జిగ, టెంకాయ నీళ్లు తాగుతూ ఉల్లాసంగా ప్రజలతో మమేకమయ్యారు. కుటుంబ సభ్యుల పేరుతో వచ్చిన బుక్‌లెట్‌లను అందజేస్తూ ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేశారు. గ్రామంలో పలువురు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరగా, ఎమ్మెల్యే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని మరి కొంతమంది విజ్ఞప్తి చేయగా, వెంటనే హౌసింగ్ అధికారులతో మాట్లాడి వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర బల్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూదన్‌రాజు, స్టీరింగ్ కమిటీ సభ్యులు శివశంకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ శేషూరెడ్డి, సొసైటీ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సర్పంచ్ నరసమ్మ, ఎంపీటీసీ కోగర జయమ్మ, నక్కలచిన్నప్ప, నాగరాజు, నరసింహులు, రాజన్న, లక్ష్మీనారాయణ, గంగులప్ప, నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ నసీమా, ఎస్ఐ వెంకటనారాయణ, ఏఓ జ్యోత్స్న, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి

మండలంలోని యర్రగుండువారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి (70) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళి అర్పించి, మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, యువనాయకులు కొత్తకోట చక్రధర రెడ్డి కూడా గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

'నవరత్నాల'తో పేదల జీవితాల్లో వెలుగులు

ధర్మవరం: నవరత్నాల సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక 40వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలు రహదారికి అడ్డుగా బండలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు.ఆయన స్పందిస్తూ సర్వే చేయించి సమస్యను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మరికొంత మంది సీసీరోడ్లు, డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ డ్రైన్‌లు, ఆ తర్వాత సీసీరోడ్లు వేయిస్తామన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ, కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా పేదవారైతే చాలు పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అన్నారు. రైతులు, చేనేతలు, మహిళలకు ప్రతి ఒక్కరికీ, ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, వైస్‌చైర్మన్‌లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, కౌన్సిలర్ మట్టిద్దుల సుజాత, వార్డు ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, నాయకులు చంద్రశేఖర్, రామ్మోహన్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, హనుమంతు,వద్దే ఆది, మాబూపీరా, అక్కులప్ప, మంజునాథ, సాదిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకనుగుణంగా సాగాలి

బత్తలపల్లి: ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఏడీఏ క్రిష్ణయ్య, ఏఓ ఓబిరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం బత్తలపల్లి రైతు భరోసా కేంద్రంలో భూసార మట్టి పరీక్షల నిర్వహణపై రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుంటూ పంట మార్పిడి చేస్తూ పంటలు సాగు చేయడం వల్ల దిగుబడి సాధించవచ్చన్నారు. షేక్షావలికి చెందిన పొలంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఏఈఓలు జగదీష్, వీరాంజనేయులు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'గురుకులం' వద్ద తల్లిదండ్రుల ఆందోళన

తనకల్లు: మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు దగ్గర ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల వద్ద సోమవారం విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందిలో కొందరు తమ పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను ఇష్టారాజ్యంగా ఇళ్లకు తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలోని ద్విచక్ర వాహనాల్లో సరుకులను దొంగచాటున తరలిస్తుంటే అడ్డుకున్నామన్నారు. సరుకులు తీసుకొని పోయేదే, చేతనైంది చేసుకోండని దురుసుగా ప్రవర్తించినట్లు వాపోయారు. పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరనాయుడుతో మాట్లాడారు. సరుకులను తీసుకెళ్తున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ప్రిన్సిపాల్ చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు



12వ వార్డులో ప్రజల అభిప్రాయం సేకరిస్తున్న కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి



బత్తలపల్లిలోని ఓ ఇంటి వద్ద ఆరా తీస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు

బత్తలపల్లి: సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే చేరుస్తున్నారని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు తెలిపారు. సోమవారం బత్తలపల్లిలోని బీసీ కాలనీ, వినాయక్ నగర్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ, గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం మేలు చేసిందా? లేదా అని ప్రజల నుంచి వివరాలు రాబట్టారు.

విశేష స్పందన

ధర్మవరం: స్థానిక 12వ వార్డులో కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కౌన్సిలర్ ఉమాదేవి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి లాంటి పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రతి ఇంటికీ పెద్ద దిక్కయ్యారన్నారు. వార్డు ఇన్‌చార్జ్ తొండమాల రవి, రమాదేవి, సుహాసిని తదితరులు న్నారు.

ఆదరణ

ఎన్పీకుంట: మండలంలో చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. సోమవారం మండల కేంద్రంతో పలు పంచాయతీలలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, సర్పంచ్ నాగమునీశ్వరనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: మండల కేంద్రంతో పాటు డబురువారిపల్లి, మిట్టపల్లి, టీ.కుంట్లపల్లి, తంగేడుకుంట, చింతమానుపల్లి గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులు ఇంటింటా కరపత్రాలు అందించారు. ఎంపీపీ ఫర్వీన్‌బాను, టౌన్ కన్వీనర్ కోళ్లక్రిష్ణారెడ్డి,సర్పంచు గోవిందు, వక్ఫ్ బోర్డు మెంబర్ జౌలిబాబా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో..

నల్లచెరువు: మండల కేంద్రంలోని విజయలక్ష్మి కాలనీలో నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గృహసారథులు కుల్లాయప్ప, చంద్రకళ వలంటీర్ సాయి పల్లవి పాల్గొన్నారు.

మామిడి చెట్ల దగ్ధం

తనకల్లు: స్థానిక భైరాగిస్వామి గుడి సమీపంలో తలారి నారాయణప్పకు చెందిన మామిడితోటలోని చెట్లు సోమవారం మంటలకు దగ్ధమయ్యాయి. ఐదేళ్లుగా కాపాడుకున్న చెట్లు కాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కుమారుడు తలారి సురేంద్ర వాపోయాడు.

మృతుడు బుడ్డప్పనగర్ నివాసి

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి సమీపంలో హెచ్చెల్సీ వద్ద పొలాల్లో ఆదివారం పోలీసులు గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతుడిని అనంతపురంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన హసన్ కుమారుడు షేక్ బాబా ఫకృద్దీన్ (35)గా గుర్తించారు. మృతికి కారణాలు తెలియదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇల్లు మంజూరై కట్టుకోవడం ఇష్టం లేని లబ్ధిదారులకు సొంతస్థలం ఉంటే అక్కడే కట్టుకునేందుకు అవకాశం కల్పించాలని చెప్పారు. వారి పట్టాలను వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇంటి నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

కదిరి టౌన్: పట్టణంలోని కస్తూరిబాయ్ వీధిలో ఖాజీ మన్నాన్ ఆధ్వర్యంలో సోమవారం కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మౌజాన్‌లు, ఇమామ్‌లకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాజీ మన్నాన్ అభినందనీయుడన్నారు. ఆయనకు తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల జామియా మసీదులో కదిరి మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సహపంక్తి భోజనం చేశారు. కౌన్సిలర్లు తదితరులున్నారు.

పరామర్శ

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం గ్రామ సర్పంచు సానే జయచంద్రారెడ్డిని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. జయచంద్రారెడ్డి చెవి కింద గడ్డ ఉంటే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో రూ.6 లక్షలు దాకా ఖర్చు చేసి ఆపరేషన్ చేయించుకున్నారు. గ్రామానికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం సర్పంచును పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, ముష్టూరు నరసింహారెడ్డి, బండి వీరనారప్ప, సంద్ర రామకృష్ణ, రాంభూపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తరాదు

పుట్టపర్తి: వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగరాజుపల్లి, టీ చెర్లోపల్లి, నల్లమాడలో నూతనంగా మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో పాడైన విద్యుత్ స్తంభాలను మార్చు చేయాలని ఆదేశించారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్ మంజూరు చేయాలన్నారు. ఎస్ఈ సురేంద్ర, ఈఈ మోహనమ్మ, డీఈ మోజెస్, ఏడీ ఓబులేసు తదితరులున్నారు.

'ప్రయివేటు వ్యక్తిని రానీయొద్దు'

కదిరి అర్బన్: ఎంతో విలువైన భూ రికార్డులు ఉన్న తహసీల్దార్ కార్యాలయంలోకి వాసు అనే ప్రయివేటు వ్యక్తిని రానీకూడదని సోమవారం 'స్పందన'లో రామాంజులు అనే వ్యక్తి తహసీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. కుమ్మర వాండ్లపల్లి పంచాయతీ పత్తిగడ్డ గ్రామానికి చెందిన వాసు అనే వ్యక్తి తాను వీఆర్ఓ, ఎంఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్నానని చెప్పి పాసుబుక్కు, రేషన్‌కార్డు, ఇంటి పట్టా కోసమని వచ్చే ప్రజల వద్ద డబ్బు తీసుకుని మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో కదిరిలో పనిచేసిన ఆర్డీఓ వెంకటేశ్వర్లు .. వాసును కార్యాలయంలోకి రానీకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరితే వాసు తమ కార్యాలయ ఉద్యోగి కానేకాదన్నారు. ప్రవేటు వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతించమన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రాఘవంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చెన్నకేశవరెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇటీవల గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఉండగా తెలుసుకుని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం సోమవారం ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ఆ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యర్రభూమి రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రశాంతి నిలయం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ సూచించారు. సోమవారం సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద గల జిల్లా మలేరియా నివారణ అధికారి కార్యాలయంలో జిల్లాలోని మలేరియా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూరుల్లా



కదిరి అర్బన్: కలెక్టర్ అరుణ్‌బాబును సోమవారం జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మొగల్ నూరుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీ నాయకులు గాయజ్‌బాషా, ఎహషాన్ తదితరులు ఉన్నారు.

పండుగ సంతోషంగా జరుపుకోండి



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ముస్లిలందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మసీదులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోమవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదులో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీర్ రామకృష్ణా రెడ్డి, ఎంపీటీసీలు పవన్‌కుమార్ రెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

బాధిత రైతుకు అండగా నిలుస్తాం

కనగానపల్లి: అగ్ని ప్రమాదంలో వేరుశనగ వామి కాలిపోయి నష్టపోయిన రైతు గోవిందురెడ్డికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున అండగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. మండలంలోని తగరకుంటలో శనివారం రాత్రి వేరుశనగ వామికి నిప్పంటుకొని పంట నష్టం జరిగిన విషయం తెలిసిందే. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించి, బాధిత రైతు గోవిందురెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వలగొండ భాస్కర్, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు ముక్తాపురం రమణారెడ్డి, పెద్దిరెడ్డి, అంకె అశోక్, మాధవరెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

30లోపు పన్ను చెల్లిస్తే 5 శాతం మినహాయింపు

ధర్మవరం: మున్సిపాలిటీ పన్నులను ఈనెల 30 లోపు చెల్లిస్తే 5 శాతం మినహాయింపు ఉంటుందని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఆన్‌లైన్, మున్సిపల్ కార్యాలయం, లక్ష్మీచెన్నకేశవపురం, ఎల్పీ సర్కిల్ సచివాలయాల్లో చెల్లించవచ్చన్నారు.

విద్యా గణపతి ప్రతిమ వితరణ

ఓడీ చెరువు: ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఏర్పాటు చేయనున్న విద్యా గణపతి ప్రతిమను మండల కేంద్రానికి చెందిన టైలర్ రాము వితరణ చేశారు. ఆలయ నిర్మాణ సంకల్పకులు ఆంజనేయులునాయుడికి రాము కుటుంబ సభ్యులు ప్రతిమను సోమవారం అందచేశారు.

నేటి నుంచి ఆధార్ వారోత్సవాలు

కనగానపల్లి: మంగళవారం నుంచి ఆధార్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 18న తగరకుంట, 19న యలకుంట్ల, 20న నరసంపల్లి, 26న మద్దెలచెరువు, 27న దాదులూరులో నిర్వహిస్తామన్నారు.

ధర్మవరం రూరల్: ఏలుకుంట్ల గ్రామంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, 26,27తేదీలలో ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ మమతాదేవి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ధర్మవరం అర్బన్: శివానగర్ బీఎస్ఆర్ స్కూల్ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుమందిని అరెస్టు చేసి రూ.55 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పేకాటరాయుళ్ల అరెస్టు చూపించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నల్లమాడ: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు, నాయకులు సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ వరుణ్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కుళ్లాయినాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ హాజరై ఇంజినీరింగ్ సహాయకులకు సూచనలు,సలహాలిచ్చారు.

విద్యతోనే బంగారు భవిత

ధర్మవరం అర్బన్: ప్రణాళికతో కూడిన విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని కాకతీయ విద్యానికేతన్ ఫౌండర్ శెట్టిపి రామిరెడ్డి, కంటి వైద్యులు ఉరుకుందప్ప, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో చలివేంద్రం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, ఏపీపీ ఫకృద్దిన్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ: పీసీ రేవు గ్రామంలో అక్కమ్మ దేవత ఆలయ నిర్మాణానికి సోమవారం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

చెన్నేకొత్తపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని స్థానిక సీఐ చిన్నగౌస్, ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. 14 కేసుల కర్ణాటక మద్యంతోపాటు 105.43 లీటర్ల 6 కేసులు నాటు సారాను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు.